ఉపాధి 'చిత్రాలు'

- ఒక్క ఫొటోతో నాలుగు మస్టర్లు
- బోగస్ హాజరుతో నిధులు స్వాహా
- సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తామంటేనే ఉపాధి పని
- లేకపోతే పనులకు రావొద్దంటూ కూలీలకు టీడీపీ నేతల కండీషన్





ఉపాధి పనులకు వచ్చినట్లు చూపుతున్న ఒరిజనల్ ఫొటో ఉన్న మస్టర్, అదే ఫోటోను అతికించిన ఫేక్ మస్టర్లు

కౌతాళం: ఉపాధిహామీ పనులు టీడీపీ నేతల జేబులు నింపుతున్నాయి. తప్పుడు మస్టలు వేసి, ఎక్కువ మంది పనులకు హాజరైనట్లు చూపి నిధులు కాజేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒకే గ్రూపులోని వ్యక్తులను వేర్వేరు చోట్ల ఫొటోలు తీసి, వేర్వేరు గ్రూపులుగా చూపుతూ హాజరు వేస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఉపాధి పనులు కావాలంటే వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులకు ఓటు వేయాలని కండీషన్ పెడుతున్నారు.

ఒకే గ్రూపుతో మూడు ఫొటోలు..

మండల పరిధిలోని తోవి గ్రామంలో పనులకు 10మంది వస్తే 40 మంది హాజరైనట్లు సృష్టించి, ఫొటోలు మార్ఫింగ్ చేసి నాలుగు మస్టర్లు వేసి కూలి డబ్బులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో ఉపాధి కూలీ పనులకు 10మంది పోతే ఆ గ్రూపు సభ్యులను వేర్వేరు చోట్ల నిలబెట్టి మూడు ఫొటోలు తీసి, మూడు వేర్వేరు మస్టర్లకు అతికించి హాజరు వేస్తున్నట్లు తెలిసింది. మస్టర్లలో పేర్లు వేరుగా ఉన్నప్పటికీ ఫొటోలు మాత్రం ఆ పది మందివే ఉంటాయి. అలాగే ఒక గ్రూపులో 10 మందికి గాను 30 మందిని అదనంగా చూపిస్తూ.. 40 మంది ఉపాధి పనులు చేసినట్లు సృష్టించి డబ్బులు స్వాహా చేస్తున్నట్లు తెలిసింది. మూడు గ్రూపులకు గాను 9 గ్రూపులు పనులు చేస్తున్నట్లు చూపుతున్నారని సమాచారం.

టీడీపీకి ఓటు వేస్తామంటేనే పనులకు రండి!

రాబోవు సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుడైన సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేస్తామంటే ఉపాధి పనులకు రండి, పనులకు వచ్చి ఎలాంటి పని చేయకపోయినా కూలి డబ్బులు ఇప్పిస్తామంటూ ఆ పార్టీ నాయకులు హామీ ఇస్తున్నారు. (పెద్ద ఎలక్షన్‌లు) ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో మీరు ఎవరికైనా ఓటు వేసుకోండి సర్పంచ్‌కు మాత్రం టీడీపీకే ఓటు వేయాలని హుకుం జారీ చేస్తున్నారు. లేక పోతే పనులకు రావొద్దంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో పనులకు చాల తక్కువ మంది హాజరవుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

మస్టర్ల విషయంపై ఏపీఓ బజారప్పను వివరణ కోరగా.. తోవి గ్రామంలో 50 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని తెలిపారు. ఒకే మస్టర్లపై మూడు ఫేక్ మస్టర్లు సృష్టించి డబ్బులు స్వాహా చేస్తున్నారన్నదాంట్లో నిజంలేదు. అలాంటి ఏదైనా జరిగితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీడీపీకి ఓటు వేస్తానంటేనే పనికి రా అన్నారు



రాబోవు సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తానంటే ఉపాధి పనులకు రా.. లేదంటే పనులకు రావొద్దు అన్నందుకు నేను మూడు నెలల నుంచి పనులకు పోవడం లేదు. మేము ఎప్పటి నుంచో వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్నాం. పనులు లేక పోతే పస్తులుండి, గంజి తాగి అయినా బతకగలం. గ్రామంలో ఉపాధి లేకపోతే పట్టణాలకు వెళ్లి బతకగలం అంతేకాని ఓటు వేస్తామని మాత్రం పనికి పోను. –లక్ష్మన్న

మూడు, నాల్గుసార్లు ఫొటోలు తీస్తారు



ఉపాధి పనులు చేసే సమయంలో మూడు నాల్గు చోట్ల నిలబెట్టి ఫొటోలు తీస్తారు. మాకు చదువు లేదు, ఎందుకు తీస్తారో అర్థం కావడం లేదు. గతంలో ఇలాంటి ఫొటోలు ఎప్పుడూ తీయలేదు. అంతేకాక మూడు నెలల నుంచి కూలి డబ్బులు రాలేదు. అందుకే పనులకు పోకుండా మానుకున్నా. – చిన్న ఈరన్న

క్లుప్తంగా

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



మాట్లాడుతున్న నవోదయ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ హరికృష్ణ

ఆదోని అర్బన్: గ్రంథాలయాలు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే విజ్ఞాన నిలయాలని నవోదయ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ హరికృష్ణ అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి సుజాత ఆధ్వర్యంలో సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని భాగంగా మొదటిరోజు సరస్వతి తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులకు గ్రంథాలయం ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, నరసింహులు, రమేష్, రిటైర్డ్ ఉద్యోగి శారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దీక్ష చేస్తున్న ఆర్టీసీ కార్మికుల యూనియన్ నాయకులు

ఆదోని టౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆదోని డిపో డ్రైవర్లు, అసిస్టెంట్ మెకానిక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డిపో ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఎస్‌ఎంయూఏ నాయకులు హరిబాబు, లక్ష్మన్న, ఆరోగ్యప్ప, రామలింగప్ప, కతాల్ సాహెబ్, నాగరాజు, షరీఫ్ మాట్లాడుతూ 1/2019 భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు పెంచాలన్నారు. దీక్షలో ఆర్టీసీ కార్మికులు బసయ్య, వీరేష్, ఎల్లప్ప, రామాంజనేయులు, వీరేష్ తదితరులు కూర్చున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల దీక్ష

ఎమ్మిగనూరుటౌన్: తమ సమస్యల పరిష్కారానికై ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరవధిక దీక్షలు చేపట్టారు. అంతకు మునుపు డిపో గేట్ వద్ద ప్లకార్డులు చేతపట్టి, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దీక్షలో ఉద్యోగులు గంగుడి నాగరాజు, చంద్రయ్య, తిమ్మప్పలు కూర్చున్నారు.

దేవరను ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న ఎస్ఐ కేశవ

నందవరం : మండల పరిధిలోని కనకవీడులో మే 6, 7 తేదీల్లో చేపట్టే గ్రామ దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ కేశవ గ్రామస్తులకు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కనకవీడు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. అల్లర్లకు పాల్పడితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. దేవర ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమన్నారు.

యువతికి ఆర్థికసాయం

ఎమ్మిగనూరుటౌన్: తల్లి, తండ్రి మృతి చెందడంతో డీఎస్సీ కోచింగ్‌కు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పట్టణానికి చెందిన హుసేనమ్మ అనే యువతికి స్థానిక చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సోమవారం ప్రసన్నరాజు, అన్న పూర్ణమ్మ, అధ్యక్ష, కార్యదర్శులు మాదన్న, ప్రకాశం రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అడివన్న, భాగ్యరాజు, సుధాకర్, రాజు, ఉపాధ్యాయులు ప్రవీణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



సంచార చికిత్సను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

పత్తికొండ రూరల్ : బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. సోమవారం పత్తికొండలోని బుడగజంగాల కాలనీలో కో–లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న 104 సంచార చికిత్స కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ అమ్మాయికి 18సంవత్సరాలు, అబ్బాయికి 21సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహాలు చేయాలన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే హెల్ప్‌లైన్ 1098 కి ఫోను చేయాలని తెలిపారు. ఇరువురి తల్లిదండ్రులు, పురోహితులపై కూడా చర్యలుంటాయని హెచ్చరించారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, వాటిని సత్వరం మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి నివేదించాలని వైపీఎల్ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో జేసీ నవ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అదేవిధంగా డీఎస్సీ అభ్యర్థులకు పరీక్షలు రాసేందుకు గాను 60 నుంచి 90 రోజుల గడువు ఇవ్వాలన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: కార్మికులకు నష్టం తెచ్చేలా కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను సత్వరం రద్దు చేయాలని ఐఎఫ్‌టియూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికులను,రైతాంగాన్ని కార్పొరేట్లకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లు, అగ్రిమార్కెట్ చట్టాలు తీసుకొని రావడాన్ని వ్యతిరేకించాలన్నారు.

ఆదోని రూరల్: బీజేపీ సర్కార్ తెచ్చిన లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాటాలు తీవ్రతరం చేద్దామని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కార్యాలయం ఎదుట మేడే పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారం మార్పిడి జరిగి 77 సంవత్సరాలు అవుతున్నా దేశంలో కార్మిక వర్గానికి ఉద్యోగభద్రత లేదన్నారు. నాయకులు కుమార్, నారాయణ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థినులను అభినందిస్తున్న స్వకులసాళీ విద్యావర్తక సంఘం నాయకులు

ఆదోని అర్బన్: పదో తరగతి ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన చేనేత వర్గానికి చెందిన విద్యార్థులను స్వకులసాళీ విద్యావర్తక సంఘం నాయకులు సన్మానించారు. సోమవారం స్థానిక స్వకులసాళీ విద్యావర్తక సంఘం కార్యాలయంలో పదిలో అత్యధిక మార్కులు సాధించిన సకరే సంజన, సోంసోలే నిఖిత, సకరే శ్రీహర్ష, రాసాలే రంజిత, సోంసోలే అఖిల, మలేకర్ సీమ, రాంసాలే శృతి, అలాగే ఇంటర్మీడియెట్‌లో కాలేజ్ టాపర్‌గా నిలిచిన సకరే మనోహర్‌లను, వారి తల్లిదండ్రులకు మెమోంటోలు, శాలువాలతో సన్మానించారు. సంఘం గౌరవాధ్యక్షుడు సకరే మారుతిరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.జి.వీరన్న, రాసాలే రామలింగ, సకరే ఈరన్న, బాలాజీ, మహిపాల్, గణేష్, కాశీనాథ్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవమ్మ

నందవరం : వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దని ఆర్‌డబ్ల్యూస్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులను ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో మండల సర్వ సభ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాలలో నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్లు మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. అలాగే పెళ్లి సీజన్ ప్రారంభమైందని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని బాల్య వివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మద్రి అగ్నేశమ్మ, డీటీ శశిశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేఖ, ఎంఈఓ రఘునాథ్, ఆర్‌డబ్ల్యూయ్యఎస్ ఏఈ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


పచ్చదనాన్ని పెంచడానికి సహకరించండి



మాట్లాడుతున్న గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు లలిత

ఆదోని అర్బన్: పట్టణంలో పచ్చదనాన్ని మరింత పెంచడానికి గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కృషి చేస్తోందని, ఇందుకు మున్సిపాలిటీ సంబంధిత అధికారులు సహకారం అందించాలని ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు లలిత ఎమ్మెల్యే పార్థసారథిని కోరారు. సోమవారం స్థానిక మెడికల్ అసోసియేషన్ హాలులో గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో పచ్చదనాన్ని పెంచడానికి 2019 సంవత్సరంలో మున్సిపల్ పార్కులో 350 మొక్కలు నాటామన్నారు. ఇప్పటిదాకా అక్కడక్కడ 5 వేలు మొక్కలను నాటడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచేందుకు కావాల్సిన ఎస్టిమేషన్ తయారు చేసి కౌన్సిల్‌లో బిల్లు పెట్టి పాస్ చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ సందీప్, ఆర్గనైజేషన్ సభ్యులు హరిత, రఘురాం, జితేంద్ర, లక్ష్మీదేవమ్మ, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రమాదంలో చనిపోయిన సుమతి

పెద్దకడబూరు: ఆటోను బొలేరో వాహనం ఢీ కొనడంతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పుత్తూరు మండలం రంగంపేట గ్రామానికి చెందిన మేనపాటి ధరణి, ఆయన వదినలు సుమతి, నాగమ్మతో కలసి ఆటోలో కోడి పిల్లల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వెళ్తుండగా మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలో ఆదోని పట్టణానికి చెందిన మహ్మద్ అలీకి చెందిన బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ధరణితో పాటు ఆయన వదినలకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా సుమతి(45) అప్పటికే చనిపోయినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. ధరణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ క్యాండిల్ ర్యాలీ



28వైఎంఓఆర్47. క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

ఎమ్మిగనూరుటౌన్: కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ సోమవారం రాత్రి పట్టణంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. అక్కడ మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రమేష్, ప్రభాకర్‌రెడ్డి, జయన్న, వీరేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలు అనుచితం

ఎమ్మిగనూరుటౌన్: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లు కూల్చివేయడాన్ని ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు అనుచిత వ్యాఖ్యలు చేయ డం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి గోవిందు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ వైపు కూటమి ప్రభుత్వం పేదల ఇంటి కల నెరవేర్చుతామని చెబుతుంటే డిప్యూటీ స్పీకర్ మాత్రం పేదల ఇళ్లు కూల్చేందుకు సహకరించడం దారుణమన్నారు. దీన్ని ప్రశ్నించిన తమ రాష్ట్ర నాయకుడిని ఇష్టానుసారంగా మాట్లాడటం శోచనీయమన్నారు. ఆయన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాముడు, లక్ష్మీనర్సయ్య, రమేష్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విజేతలకు సత్కారం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన స్థానిక భవిత కేంద్ర విద్యార్థులను సోమవారం తహసీల్దార్ శేషఫణి సత్కరించారు. ఈనెల 21 నుంచి 23వరకు విజయవాడలో ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు జరిగాయి. ఇందుల స్థానిక భవిత కేంద్ర విద్యార్థులైన ఎం.శేఖర్ సైక్లింగ్, సంతోష్ వంద మీటర్ల పరుగు పందెం, 50 మీటర్ల పరుగు పందెంలో దిలిప్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఎంఈఓ ఆంజినేయులు, ప్రతిభ కేంద్ర ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు బాబు తెలిపారు. కార్యక్రమంలో భవిత కేంద్ర నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం కింద 100 శాతం సబ్సిడీ పండ్ల తోటల పెంపకానికి అసక్తికలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీడీ అల్లీపీరాం సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతు కుటుంబాలకు 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకం చేసుకోవచ్చన్నారు. ఎమ్మిగనూరు క్లస్టర్‌లోని సి.బెళగల్, గోనెగండ్ల, నందవరం, గూడూరు, ఎమ్మిగనూరు మండలాల రైతులకు అవకాశం ఉందని చెప్పారు. మామిడి, చీనీ, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, అంజీర, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ, గులాబీ, గుండుమల్లెలు తోటల ను పెంచుకోవచ్చన్నారు. 5 ఎకరాల లోపు భూమి ఉండి, బోరు, బావి, మెట్ట రైతులు అర్హులని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమం లక్ష్యమని, కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీవుల్లా, డీఎల్‌డీవో రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ

ఆదోని పౌర సరఫరా గోదాము పాయింట్‌ను సోమవారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. గోదాములో ఉన్న రేషన్ నిల్వలు, రికార్డులు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శివరాముడు, ఉప తహసీల్దార్ రవీంద్రారెడ్డి, పౌర సరఫరా ఉప తహసీల్దార్ వలీబాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

ఆదోని టౌన్: వచ్చే నెలలో జరగబోయే మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర సందర్భంగా మున్సిపల్ పరిధిలోని ప్రాంతాల్లో శుభ్రత, పచ్చదనం, శానిటేషన్ మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ను కౌన్సిలర్లు బాలాజీ, ముంబతిస్వామి, గట్టు ఇంతియాజ్, భాస్కర్, ఫయాజ్‌అహ్మద్ వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు రోడ్లపై గుంతలు లేకుండా మరమ్మతులు చేయడం, పరిసరాలను శుభ్రంగా, ఆకర్షణీయంగా ఉంచడం కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పల్లెపాడులో తాగునీటి ఎద్దడి



బీరప్ప ఆలయ సమీపంలో కుళాయిల వద్ద గుమి కూడిన ప్రజలు

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ప్రభావంతో గ్రామంలో ఉన్న బోర్లలో నీరు ఇంకి పోయాయి. డి.బెళగల్ గ్రామ రోడ్డులో ఉన్న ఒక బోరు నుంచి ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతోంది. ఈ బోరు నుంచి రెండు రోజుల కొకసారి తాగునీటి విడుదల చేస్తున్నారు. అయితే అవి కూడ సక్రమంగా సరఫరా చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో నీళ్ల దొరకక కులాయిల వద్ద పనులు మానుకుని పడిగాపులు కాయాల్సి వస్తోందని.. అయినా నీళ్ల దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలరోజులు కావొస్తున్నా.. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి కోసం ప్రజలు గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి దుస్థితి నెలకొందని.. అక్కడ కూడా నీళ్ల దొరకడం లేదని వాపోతున్నారు. ఈ విషయం పై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజును వివరణ కోరగా వేసవి కావడంతో ఒక బోరు పూర్తిగా ఎండిపోయిందన్నారు. ప్రస్తుతం పంచాయతీ నిధులతో రెండు బోర్లు వేయించామని, పైపులైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. అవసమైతే గ్రామంలో ప్రత్యేకంగా రెండు ట్యాంక్‌లు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సంస్కరణల పేరుతో విద్యారంగం నిర్వీర్యం

గోనెగండ్ల : ప్రభుత్వం తమ ఉనికి కోసం విద్యారంగంలో సంస్కరణలంటూ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి అన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 117 జీఓను రద్దు చేస్తామని చెప్పి దాదాపు 1500పైగా ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతులతో పాటుగా 1,2 తరగతులను కూడా చేర్చి మరింత నష్టం చేస్తోందని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలలను, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రయోగాలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రపాల్, రాష్ట్ర కౌన్సిలర్ సుధాకర్, నాయకులు జిక్రియ, నాగేశ్వర రావు, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడ్‌తో వాహనాలు నడిపితే చర్యలు

కోసిగి: అధిక లోడ్‌తో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కోసిగి ఎస్ఐ హనుమంత రెడ్డి హెచ్చరించారు. సోమవారం కోసిగి మీదుగా అధిక లోడ్‌తో గడ్డివామును తీసుకెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్లను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సింగిల్ రోడ్డుపై అధికలోడు వేసుకొని రావడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.